క్లుప్తంగా

శాస్త్రీయ పద్ధతులతో వ్యాధుల నివారణ



మాట్లాడుతున్న ఏడీ వరప్రసాద్

నందికొట్కూరు రూరల్ : శాస్త్రీయ పద్ధతుల్లో గొర్రెల పెంపకం చేపట్టడం ద్వారా వాటిలో వచ్చే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గొర్రెల పెంపకందార్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సన్నజీవాలలో వచ్చే వ్యాధులను గుర్తించాలంటే యాజమాన్య పద్ధతులు, రక్త పరీక్షలు చేయించడం చాలా ముఖ్యమన్నారు. సహాయ సంచాలకులు శ్రీనివాసులు, వైద్యులు ప్రశాంతి, జానకీ, రిసోర్స్ పర్సన్ పశువైద్యులు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సుయాత్రను విజయవంతం చేయండి

ఆత్మకూరు: రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అతావుల్లా, అహ్మద్‌హుస్సేన్ ప్రతాప్, స్వామి, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

ఆత్మకూరు: దేశంలో ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట క్విట్ మోదీ - సేవ్ ఇండియా పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణకార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, మాబాషా, స్వాములు, శివ పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఖోఖో క్రీడాకారులకు క్రీడా దుస్తులను పాఠశాల హెచ్‌ఎం నాగరాజు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్ దేవానందం, అక్బర్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న ఏసీడీపీఓ మంగవల్లి

పాములపాడు: బాల్య వివాహాలు చేయడం నేరమని ఏసీడీపీఓ మంగవల్లి అన్నారు. బుధవారం స్థానిక ఏఎన్‌ఆర్ జెడ్పీహై స్కూలులో విద్యార్థులకు బాల్యవివాహాల వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్‌లైతే టోల్ ఫ్రీ నెంబర్లు 112, 181,100 లకు ఫోన్ చేయాలని వివరించారు. సమావేశంలో డాక్టర్ సావిత్రీ, హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ, డీసీపీఓ సోషల్ వెల్ఫేర్ గీతావాణి తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

మిడుతూరు: భర్త మద్యం సేవించి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేశారని పుష్పావతి ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ మారుతిశంకర్ తెలిపారు. ఈ మేరకు భర్త మంగళిపేటకు చెందిన మంగలి పుల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కన్యకాపరమేశ్వరికి పూజలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వాసవిమాతకు శ్రీచక్రనమార్చన పూజలను భక్తి శ్రద్ధలతో జరిపించారు. కార్యక్రమంలో ఉభయ జిల్లాల ఆర్యవైశ్య, అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ సహాయ కార్యదర్శి పోలూరి విద్యాసాగర్, అధ్యక్షుడు కొత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా లాల్‌షావలి జార్తలు

మహానంది: గాజులపల్లె మజరా గ్రామమైన బసవాపురంలో లాల్‌షావలి స్వామి జార్తలు బుధవారం ఘనంగా జరిగాయి. స్వామి వారికి ఫతేహాలు, గంధాన్ని సమర్పించారు. వివిధ గ్రామాల భక్తులు గ్రామానికి చేరుకుని పూలసూచికలు, కానుకలు సమర్పించారు.

పోస్టర్ల విడుదల

నందికొట్కూరు: ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర 21వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు రాముడు, సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏపీ ఎన్‌జీఓ భవనంలో పోస్టర్లను విడుదల చేశారు.

విజృంభిస్తున్న కళ్లకలక

- చిన్నపిల్లల్లో అధికంగా వ్యాప్తి
- పాఠశాలలకు పంపేందుకు జంకుతున్న తల్లిదండ్రులు
- పలు పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బైర్లూటిలో విద్యార్థులకు కళ్ల కలకపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో కళ్లకలక వ్యాధి విజృంభణ కొనసాగుతోంది. గత 10రోజులుగా వ్యాధి తీవ్రత మరింత అధికమైంది. ఇది అంటు వ్యాధి కావడం వలన చిన్నపిల్లలకు, ప్రజలల్లో రోజురోజుకు వ్యాప్తి చెందుతోంది. వ్యాధి వల్ల ప్రధానంగా చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు పాఠశాలల్లో వైద్య శిబిరాలు సైతం నిర్వహించి విద్యార్థులకు మందులను పంపిణీ చేస్తున్నారు. అలాగే నివారణ చర్యలపై వైద్యులు పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నారు.

కళ్లకలక ఇలా వ్యాప్తి చెందుతుంది

కళ్ల కలక అనగా కంటి పొర (కంజెక్టివా) కు ఇన్‌ఫెక్షన్ సోకి వాపురావటం వల్ల కండ్లకలక వ్యాధి వ్యాపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. కంటి గుడ్డు చుట్టూ తెల్లపొర, కంటి రెప్పలకు దుమ్మూధూళి చేరడంతో ఈ వ్యాధి సోకుతుంది. కళ్లకు దుమ్ము అధికంగా సోకినప్పుడు కంటిని నులపడం వలన ఈ వ్యాధి అధికమవుతుంది. ఈ వ్యాధికి గురైన కళ్లను ఇతర వ్యక్తులు చిన్నారులు చూసిన వెంటనే వారికి కూడా అంటువ్యాధిలా వ్యాప్తి చెందుతుంది.

పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల హాజరు శాతం

ఆత్మకూరు మండలంలో వివిధ వివిధప్రాంతాల్లో కళ్ల కలక అధికమవుతుంది. ఇప్పటికే పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల శాతం తగ్గింది. దీనికి తోడు దాదాపు ఒక్క ఆత్మకూరు మండలంలోనే రెండు వందల నుంచి మూడు వందల మంది ఈ వ్యాధికి గురైనట్లు వైద్యులు తెలుపుతున్నారు. కాగా ఈ వ్యాధి సోకిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

చికిత్స ..

ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే కంటివైద్యులను ఆశ్రయించి చికిత్సలు చేయించుకోవాలి. వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను ఆశ్రయించి చికిత్సలు పొందాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కంటిచూపు మందగించే అవకాశాలున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ వైద్య శాలల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ వైద్యశాలలో సైతం చికిత్స పొందవచ్చు.

అన్ని చోట్ల మందులున్నాయి

కళ్ల కలక వ్యాధి రోజు రోజుకు అధికమవుతుంది. అయినా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్ని వైద్యశాలల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యశాలకు వచ్చి పరీక్షలు నిర్వహించుకుని మందులు తీసుకోవాలి. వ్యాధి సోకిన వ్యక్తి రెండు, మూడు రోజులు విశ్రాంతి తీసుకుంటే త్వరగా తగ్గిపోతుంది.

– డాక్టర్ పవన్‌కుమార్, బైర్లూటి వైద్యాధికారి, ఆత్మకూరు

బడికి పంపలేక పోతున్నాం



ఆత్మకూరు మండలంలో కళ్ల కలక అధికం కావడంతో పిల్లలను పాఠశాలకు పంపాలంటే ఆందోళనగా ఉంది. ఒక్క డీపాల్ పాఠశాలలోనే పలువురికి ఈ వ్యాధి సోకడంతో పిల్లలను బడికి పంపించాలంటే భయంగా ఉంది. ఈ వ్యాధి సోకడం వలన పిల్లలు తీవ్రంగా ఇబ్బంది పడే ప్రమాదం ఉంది.

– బాషా, ఆత్మకూరు

హాస్టల్ విద్యార్థులకు కళ్లకలక

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో కళ్లకలక వ్యాధి తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధి వల్ల ఎలాంటి ప్రమాదం లేకపోయినా వారం రోజులపాటు కళ్లు నలకగా, మంటగా ఉండటం, నీళ్లుకారటం, పుసుళ్లతోడి కళ్లు తెరవటానికి ఇబ్బందికరంగా ఉండటం తో కొంత మేర ఇబ్బందిపడాల్సి ఉంటుంది. విద్యార్థులకు ఈ వ్యాధి సోకడం వారి నుంచి కుటుంబ సభ్యులకు వ్యాపిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలోని కస్తూర్బాగాంధీ, మోడల్‌పాఠశాల, గురుకుల పాఠశాల, ఎస్సీబాలికల వసతి గృహాలున్నాయి. వీటిల్లో ఉమ్మడి జిల్లాల్లోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారిలో ఒకరికి వ్యాధి సోకడంతో హాస్టల్లో ఉన్న వారందరికీ వ్యాపిచెందింది. ఇప్పటికే సుమారు 200మంది విద్యార్థులు ఈ వ్యాధి బారిన పడినట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. వ్యాధి సోకిన విద్యార్థులకు ఇతరులకు దూరంగా ఐసోలేషన్‌లో ఉంచి, చికిత్స చేయిస్తున్నారు. సమీప గ్రామాల విద్యార్థులు అయితే వారి తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపిస్తున్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నందికొట్కూరు: డయల్ యువర్ డీఎం కార్యక్రమం గురువారం నిర్వహిస్తునట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఉదయం 12 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రజలు, ప్రయాణికులు అమూల్యమైన సలహాలు, సూచనలు, ఫోన్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఎలాంటి సమస్యలైన డిపో మేనేజర్ సెల్ నెంబరు 99592 25799కు ఫోన్ చేసి తెలుపవచ్చని చెప్పారు.

కళాకారులకు ప్రోత్సాహం అందించాలి

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళలను, కళాకారులను ప్రోత్సహించాలని ప్రజా నాట్య మండలి జిల్లా కన్వీనర్ నాగరాజు, కమిటీ సభ్యులు కోరారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారితున్నా కళాకారులకు ఆదరణ దక్కడం లేదన్నారు. సాంస్కృతిక శాఖ ద్వారా కళాకారులకు ప్రభుత్వం మంజూరు చేయాల్సిన పథకాలను అమలు చేసేలా కృషి చేయాలన్నారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నంద్యాల జిల్లా కేంద్రంలోని నరసింహయ్య భవనంలో జిల్లా స్థాయి పాటలు, డ్యాన్స్, కోలాట శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కళాకారుల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మాబాషా, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటర్ల సర్వే



స్టాఫ్ క్వార్టర్స్ వద్ద సర్వే నిర్వహిస్తున్న బీఎల్‌ఓ ఎండీ రఫి, ఏజెంట్లు

శ్రీశైలం: శ్రీశైలక్షేత్ర వ్యాప్తంగా బూత్‌లెవల్ ఆఫీసర్లు, బూత్‌లెవల్ ఏజెంట్లు ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేస్తున్నారు. ఆయా వార్డుల బీఎల్‌ఓలు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఆధార్‌కార్డు, ఓటర్‌కార్డులను పరిశీలించి, అడ్రస్ మార్పిడి, తప్పుల పరిశీలించడంతో పాటు ఓటర్ల లిస్ట్‌లో పేరు ఉందా లేదా అనే విషయాన్ని తెలియజేస్తున్నారు. బుధవారం దేవస్థానం సిబ్బంది స్టాఫ్‌క్వార్టర్స్ లో బీఎల్‌ఓ మహ్మద్‌రఫి, బూత్‌లెవల్ ఏజెంట్ మునుస్వామి, నాగరాజు ఆచారిలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ నెల 20వ తేదీలోగా క్షేత్ర వ్యాప్తంగా అన్ని వార్డులకు సంబంధించిన బూత్‌లెవల్ ఓటర్స్ నమోదు, పరిశీలన, పూర్తి చేయాలని తహసీల్దార్ రాజేంద్రసింగ్ ఆదేశించారని వారు చెప్పారు.

ఘనంగా అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం



మాణిక్యేశ్వరిసెల చెంచుగూడెం వాసులతో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని మాణిక్యేశ్వరి మాత ఆశ్రమానికి సమీపంలో ఉన్న చెంచుగూడెంలో బుధవారం అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు, కొమరం భీం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం గౌరవాధ్యక్షుడు ఆశీర్వాదం, బెనహర్ మాట్లాడుతూ ఆదివాసి చెంచు గిరిజనులకు సరైన సదుపాయాలు, పథకాలు అందడం లేదన్నారు. అటవీహక్కులు చట్టాలు ఉన్నప్పటికీ అమలు కావడం లేదని, అటవీప్రాంతం నుంచి ఆ శాఖ వారు ఆదివాసీలను బయట ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచులు

పాములపాడు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులు అధికారులను కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీపీ సరోజిని వర్ధనీయ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయా శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. చాలా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు సిద్ధంగా ఉంచిందని, సర్పంచులు స్పందించి పనులు చేయాలని జేఈ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కాగా హరిత రాయబారులకు జీత భత్యాలు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించలేమని, గతంలో మాదిరిగా ప్రభుత్వమే చెల్లించాలని కోరుతూ సర్పంచ్‌లు ఎంపీడీఓ గోపీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. సమావేశంలో డాక్టర్లు నాగలక్ష్మి, సావిత్రీ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులునాయుడు, ఎంఈఓ బాలాజీనాయక్, పశు వైద్యాధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మారుతీనగర్‌లోని ఎబినేజర్ చర్చిలో ఇండియా క్యాంపస్ క్రూసెడ్ ఫర్ క్రైస్ట్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాస్టర్ జాకబ్ స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజలకు సేవ కార్యక్రమాలు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. శిబిరంలో 250 మందికి కంటి పరీక్షలు, 200 మంది ఇతర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలరు లాలుప్రసాద్, రవూఫ్, నాయకులు ఆర్టీసీ బాబు, మధుసూదన్‌రెడ్డి, బాషా, రమేష్, చరణ్‌తేజ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సీసీరోడ్డును పరిశీలిస్తున్న సర్పంచు జమీలాబీ

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని సర్పంచు శివపురం జమీలాబీ అన్నారు. బుధవారం మండలంలోని ముసలిమడుగు గ్రామ ఎస్సీకాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రూ.20 లక్షల వ్యయంతో ఎస్సీకాలనీలోని చర్చికి వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్‌బాషా, ఫీల్డ్ అసిస్టెంట్ దేవదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస ఏర్పాట్ల పరిశీలన



లడ్డూ విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు జరిగే శ్రావణమాసోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యాలు దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీశైలదేవస్థానం ఈఓ ఎస్ లవన్న బుధవారం లడ్డూప్రసాదాల విక్రయ కేంద్రాలు, అన్నప్రసాద వితరణ, పార్కింగ్ ప్రదేశాలు, శివగంగ జలప్రసాద ప్లాంట్లను పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మేరకు లడ్డూ, ఇతర ప్రసాదాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్నప్రసాద శాలలో వండిన వంటలను పరిశీలించి, భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఈఈ వి.రామకృష్ణ, అన్నప్రసాద వితరణ విభాగ పర్యవేక్షకులు సి. మధుసూదన్‌రెడ్డి, రెవెన్యూ విభాగ పర్యవేక్షకులు కె.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జీల నిర్మాణాలు చేపట్టాలి

పాములపాడు: మండలంలోని గ్రామాలకు ప్రధాన రహదారులపై బ్రిడ్జీల నిర్మాణాలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గోపీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని కోర్ల్స్ ఆనందాపురం గ్రామానికి కేసీ కెనాల్‌పై అసంపూర్తిగా వంతెనను పూర్తిచేయాలని, ఇస్కాల గ్రామానికి భవనాశి నదిపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకటేశ్వరావు, రంగస్వామి, నాగశేషులు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హరిత రాయబారులను తొలగించరాదు

పాములపాడు: హరిత రాయబారులను తొలగించరాదని ఎంపీడీఓ గోపీకృష్ణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ హరిత రామబారులను తొలగించే హక్కు సర్పంచులకు లేదన్నారు. గ్రామంలో ప్రతి వెయ్యి మందికి ఒక హరితరాయబారి, షెడ్ వద్ద షెడ్‌మిత్ర ఉండాల్సిందే అన్నారు. వారి పని తీరు సరిగా లేకపోతే తొలగించి ఆ స్థానంలో మరొకరిని నియమించాలని సూచించారు. 2023-24 మొదటి విడత 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 6నెలల జీతాలు ఇవ్వాలని డీపీఓ ఆదేశించారన్నారు.

అటవీ సంరక్షణ చట్ట సవరణలను రద్దు చేయాలి

కొత్తపల్లి: అటవీ సంరక్షణ చట్టం 1980 నియమాల్లో చేసిన సవరణలను రద్దు చేయాలని, మణిపూర్ ఆదివాసులపై మనువాదుల హింసాకాండను ఆపాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నరసింహులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కె.జునైద్ బాషా డిమాండ్ చేశారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని శివపురం చెంచు గూడెంలో చెంచులకు మిఠాయిలు పంచారు. వారు మాట్లాడుతూ ఆదివాసులను అడవుల నుంచి గెంటివేసి కార్పొరేట్ శక్తులకు అటవీ సంపదను కొల్లగొట్టే అవకాశం కల్పించే 'అటవీ సంరక్షణ నియమాలు 2023' చట్ట సవరణ బిల్లు ఆదివాసుల హక్కులను కాలరాసేవిధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, ఏఐకెఎంఎస్, పీవైఎల్ నాయకులు వెంకటేశ్వర గౌడ్, పుల్లన్న, ఎల్లనాయుడు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లకు నేడు చివరిరోజు

జూపాడుబంగ్లా: మండలంలోని తర్తూరులో-2వ వార్డు (బీసీ, జనరల్), జూపాడుబంగ్లా-7వ వార్డు(ఓసీ మహిళ) స్థానాల ఉప ఎన్నికలకు నామినేషన్లు వేయటానికి నేడు చివరి రోజని ఆర్‌ఓ లు శ్రీనివాసులు, నాగేంద్ర తెలిపారు. ఈనెల 8 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా ఇప్పటిదాకా జూపాడుబంగ్లా 7వ వార్డుకు ఒక్కనామినేషన్ కూడా వేయలేదని ఆర్‌ఓ తెలిపారు. తర్తూరు-2 వార్డు స్థానానికి ఇప్పటిదాకా షేక్‌నూరుల్లా(బీసీ ఈ), మంగలి వెంకటరాముడు(బీసీ,బీ) నామినేషన్లు దాఖలు చేసినట్లు వెల్లడించారు. నామినేషన్లు వేయదలచిన వారు గురువారం సాయంత్రం 5గంటల్లోగా సమర్పించాలని చెప్పారు. 5గంటల తర్వాత వచ్చే నామినేషన్లను స్వీకరించమని తెలిపారు.

మిడుతూరులో మూడు నామినేషన్లు

మిడుతూరు: మండలంలోని వార్డుల ఉప ఎన్నికలకు బుధవారం మూడు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీఓ జీఎన్‌ఎస్‌రెడ్డి తెలిపారు. మిడుతూరులోని 13వ వార్డుకు మూల మాధవి, బోయ భాగ్యమ్మ, అలగనూరులోని 10వ వార్డుకు తాటిపాటి సుధాకర్ నామినేషన్లు వేశారు.

సంక్షిప్తం

రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

పాములపాడు: స్థానిక పోస్టాఫీసు ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో మోదీ హటావో దేశ్ బచావో అనే నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సబ్‌పోస్టు మాస్టర్ ఖాజామొహిద్దీన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వెంకటేశ్వరరావు, సామన్న, ఈశ్వర్ పాల్గొన్నారు.

పీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో..

నందికొట్కూరు: బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేస్తుందని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా చేశారు. అరుణ్‌కుమార్, గోపల్, జూనైద్‌బాషా, వెంకటేశ్వరగౌడ పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సకాలంలో అందజేయాలి

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు అధికారులు బ్యాంకు రుణాలను సకాలంలో అందజేయాలని ఎల్‌డీఎమ్ రవీంద్రనాథ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని బ్యాంకులకు సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. పొదుపు మహిళలకు, రైతులకు రుణాల మంజూరులో కాలయాపన చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ అధికారి రాజమహేంద్ర, పరిశ్రమల శాఖ అధికారి దానియేల్, ఫిషరీస్ ఏడీ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలి

జూపాడుబంగ్లా: నులిపురుగుల నివారణ నిమిత్తం 1-19ఏళ్లలోపు బాల, బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని పారుమంచాల, జూపాడుబంగ్లా ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ గంగాధర్ సూచించారు. బుధవారం వారు ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఆరోగ్య, ఆశ వర్కర్లకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన కల్పించారు.

రేపు గొర్రెల పెంపకంపై శిక్షణ

జూపాడుబంగ్లా: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఈనెల 11న గొర్రెల పెంపకం, తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలపై ఒక్కరోజు శిక్షణ నిర్వహిస్తున్నట్లు వెటర్నరీ ఏడీ రామాంజనేయనాయక్ బుధవారం తెలిపారు. హాజరయ్యేవారు సెల్ నెంబర్:8790997460 కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

గాజులపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

మహానంది: గాజులపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు గ్రామస్తులు బుధవారం రాత్రి ధర్నా నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. లోడ్ రిలీఫ్ పేరుతో నిత్యం సరఫరా నిలిపివేస్తూ ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదన్నారు. రోడ్‌సేఫ్టీ పోలీసులు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

ఓటు హక్కుపై అవగాహన

ఆత్మకూరు:విద్యార్థులు ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్ అన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

మెరుగైన వైద్యసేవలందిచడమే లక్ష్యం

ఆత్మకూరు: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులను స్కానింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు రషీద్, షాలుఫైల్మాన్, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు దేశభక్తి కలిగి ఉండాలి



కొత్తముచ్చుమర్రిలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న గ్రామ సర్పంచ్ కాటం రాధమ్మ



నల్లకాల్వలో విశ్రాంత సైనికుడు రవీంద్రను సత్కరిస్తున్న అధికారులు

పగిడ్యాల: ప్రతి పౌరుడు దేశ భక్తి భావాన్ని కలిగి ఉండాలని ఎంపీడీఓ వెంకటరమణ, సర్పంచ్ కాటం రాధమ్మ అన్నారు. అజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలో నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని కొత్త ముచ్చుమర్రిలో సర్పంచ్ కాటం రాధమ్మ అధ్యక్షతన చేపట్టారు. ఈ సందర్భంగా కేసీ కెనాల్ బ్రిడ్జి వద్ద శిలాఫలకం ఆవిష్కరించి, జాతీయ జెండాను ఎగరవేశారు. ఈనెల 15వ తేది వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీఓ మద్దిలేటి, ఎంపీటీసీ కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచ్ మద్దిలేటి, కాటం రమేస్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : దేశంకోసం అమరులు చేసిన త్యాగాలు మరువలేనివని ఎంపీడీవో శోభారాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో అమరవీరుల గౌరవార్థం నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో శిలాఫలకాలను ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఈసీ షబానా, టీఏ కవిత, ఎఫ్ఏ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నామట్టి ... నాదేశం అమృత వాటిక ఆవిష్కరణ

ఆత్మకూరురూరల్: భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామంలో బుధవారం నామట్టి - నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో జి .మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద అమృతవాటికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులు, స్వాతంత్ర్యం కోసం సర్వ త్యాగం చేసిన సమరయోధుల గౌరవార్థం కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. అనంతరం ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేసి మొక్కలు నాటారు. గ్రామానికి చెందిన మట్టిని ఢిల్లీకి పంపేదుకు భద్ర పరిచారు. దేశ రక్షణ కోసం తమవంతు కృషి చేస్తామని చేతులెత్తి ప్రతిజ్ఞ చేశారు. గ్రామానికి చెందిన విశ్రాంత సైనికులు అమరం రవీంద్ర, మండ్ల శంకరయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట రమణ, పీఎస్ లక్ష్మీ, హెచ్‌ఎం దయామణి పాల్గొన్నారు.

కొత్తపల్లి: మొక్కలు పర్యావరణాన్ని కాపాడే పరిరక్షకాలని, మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ విధిగా పెట్టుకోవాలని ఎంపీడీవో మేరీ సూచించారు. బుధవారం మండలంలోని నందికుంట గ్రామంలో నా మట్టి... నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద సర్పంచు నిత్యలక్ష్మీదేవి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, పోలీసు, ఆర్మీ అమరవీరుల త్యాగాలకు గుర్తుగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు.మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీరాములు అధ్యక్షతన ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీవో రేష్మ, ఏపీఎం పుల్లయ్య, ఈసీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: నందిపల్లె గ్రామంలో బుధవారం నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో శివనాగజ్యోతి ఆధ్వర్యంలో వీరులకు వందనం సమర్పించి జెండా ఎగురవేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేయటంతో పాటు, మొక్కలు నాటారు. అలాగే బండి ఆత్మకూరు మండలం బీ.కోడూరు గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో గ్రామ నాయకులు మహానంది రెడ్డి, సాగేశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, బీ.కోడూరు సర్పంచ్ వెంకట జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: నాభూమి- నాదేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీశైలంప్రాజెక్ట్ స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ వి.రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.శివశంకర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.